మహిళా స్వయం సహాయక బృందాలకు రూ.10లక్షలు పంపిణీ



మహిళా స్వయం సహాయక బృందానికి రూ.లక్ష అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మలక్‌పేట నియోజకవర్గంలోని 10 మహిళా స్వయం సహాయక బృందాలకు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల రూ.10లక్షల నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక బృందాల ద్వారా ఆర్థికంగా ఎదగడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. మహిళలు స్వశక్తితో ఎదగడానికి స్వయం సహాయక బృందాలు చేయూతనిస్తున్నాయన్నారు. ఒక్కో గ్రూప్‌కు అందజేసే రూ.లక్ష ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు అవకాశముందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకుడు సైఫుద్దీన్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

చింతల్‌బస్తీలో కార్డన్ సెర్చ్



కార్డన్‌సెర్చ్‌ను పర్యవేక్షిస్తున్న అదనపు డీసీపీ స్వామి

సైదాబాద్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ చింతల్‌బస్తీలో గురువారం రాత్రి పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సౌత్ ఈస్ట్ జోన్ అదనపు డీసీపీ టి. స్వామి పర్యవేక్షణలో 220 మంది పోలీసులు, సీఐఎస్ఎఫ్ బలగాలతో గుడిసెలలో క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీలలో బెల్ట్‌షాపులో 45 మద్యం బాటిళ్లు, పత్రాలు సక్రమంగా లేని 12 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీవాసులతో అదనపు డీసీపీ మాట్లాడుతూ శాంతి భద్రతలపై ప్రజలకు భరోసా కల్పించడంతో పాటు, నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్రమ మద్యం, గంజాయి అమ్మకాలు సాగిస్తే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. ఈ సోదాల్లో అదనపు ఏసీపీ వెంకన్ననాయక్, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఎస్ఐలు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి: కార్పొరేటర్



ఉత్తమ విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

చంపాపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని కార్పొరేటర్ సుజాతానాయక్ కోరారు. హస్తినాపురం డివిజన్ ఓంకార్‌నగర్ కాలనీలోని విశ్వజ్యోతి హైస్కూల్‌లో గురువారం రాత్రి నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవాలకు ముఖ్య అతిథిగా కార్పొరేటర్ హాజరయ్యారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు కౌన్సెలింగ్



ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ పరుశురాం

మన్సూరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నాగోలు పోలీస్‌స్టేషన్‌ను ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా నాగోల్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు, ఆకతాయిలను స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రవర్తన మార్చుకోవాలని, కుటుంబాన్ని బాధ్యతగా చూసుకోవాలని సూచించారు. ఏవైనా అసాంఘిక కార్యక్రమాల గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

నూతన పంచాంగం ఆవిష్కరణ



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం భక్త సమాజంలో ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన తెలుగు పంచాగాన్ని బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రాబోయే నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ సుఖఃసంతోషాలతో జీవించాలన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పంచాగాన్ని ఆవిష్కరించడం హర్షనీయమన్నారు. వనస్థలిపురం భక్త సమాజం అధ్యక్షులు సీ.హెచ్.వీ.ఆర్.కే మూర్తి, కాలనీవాసులు పంపన వెంకటేశ్వర్లు, పీ.వీ.కే సోమయాజులు, కృష్ణమూర్తి, మంగపతిరావు, శ్రీనివాస్, కృష్ణాదిశేషు, సత్యనారాయణ పాల్గొన్నారు.

3కే వాకథాన్



3కే వాకథాన్‌లో మహిళలు, విద్యార్థినులు

ఎల్ బీ న గ ర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యం, సాధికారత, హక్కుల కోసం ఓజోన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం 3కే వాకథాన్ నిర్వహించారు. కొత్తపేటలోని ఓజోన్ ఆస్పత్రి నుంచి ఎల్బీనగర్ చౌరస్తా వరకు నిర్వహించిన ఈ వాకథాన్‌లో ఆస్పత్రి మహిళా డాక్టర్లు, నర్సులు, సిబ్బంది, పాఠశాలల బాలికలతో మహిళల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓజోన్ ఆస్పత్రి ఎండీ దీప్తి మాట్లాడుతూ స్త్రీలలో గర్భాశయ క్యాన్సర్‌ను ఎదుర్కోవడానికి ప్రతిష్టాత్మకమైన చర్యలలో భాగంగా నామమాత్రపు ఖర్చులతో మహిళల ఆరోగ్య ప్యాకేజీలు అమలు చేయడంతో పాటు పది వేల మంది వెనుకబడిన, షెడ్యూల్డ్ తరగతులకు చెందిన పాఠశాల బాలికలకు హెచ్‌వీపీ టీకా కార్యక్రమాన్ని అమలు చేయడం 2024 సంవత్సరంలో కీలకమైన అంశమని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మీ, డాక్టర్ పూజిత, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ అరుణ, డాక్టర్ సుమ, డాక్టర్ క్రాంతిరావు, సీనియర్ సిబ్బంది సుజాత, అర్చన, రంజిని, సీఓఓ శ్రీనివాస్‌రావు, మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్లు గోపీచంద్, పవన్‌నాగ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ 2022-23 బెస్ట్ ఫెర్ఫామెన్స్ దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్‌గా హరి

- ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా అవార్డు



ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా బెస్ట్ ఫెర్ఫామెన్స్ అవార్డు అందుకుంటున్న డిపో మేనేజర్ హరి

చాదర్‌ఘాట్ : ఆర్టీసీ 2022-23 బెస్ట్ ఫెర్ఫామెన్స్ దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్‌గా హరి ఎంపికయ్యారు. ఈమేరకు ఆయన ఆర్టీసీ కళాభవన్‌లో జరిగిన గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్2022-23 కార్యక్రమంలో ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళా ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉచితంగా ప్రయాణించేలా బస్సులను ఏర్పాటు చేయడంతోపాటు గత ఏడాది దసరా పండుగ సందర్భంగా ప్రత్యేక బస్సులను నడపడంలో అందులో ప్రయాణించిన ప్రయాణికులు లక్కీ డ్రా అవకాశాన్ని వినియోగించుకోవడంలో చూపిన చొరవను ప్రశంసిస్తూ ఎండీ సజ్జనార్ అవార్డు అందజేశారని హరి తెలిపారు. ఈ అవార్డు డిపో కార్మికులకే అంకితమని ప్రకటించారు.



హయత్‌నగర్‌లోని రామలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కుటుంబ సభ్యులు



గడ్డిఅన్నారంలోని పాత శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ లింగాల బస్వరాజ్‌గౌడ్, లింగాల శ్రీనివాస్‌గౌడ్



కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలో ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఈఓ శ్రీనివాసశర్మ, ధర్మకర్తలు



తట్టిఅన్నారంలోని ఆలయంలో శివలింగాన్ని దర్శించుకుంటున్న నాగోల్ ఇన్‌స్పెక్టర్, భక్తులు

హరహర మహాదేవ.. శంభో శంకర

- శివనామ స్మరణలతో మార్మోగిన శైవ క్షేత్రాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- వైభవంగా మహాశివరాత్రి మహోత్సవం

హయత్‌నగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి వేడుకలు హయత్‌నగర్, తుర్కయంజాల్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే స్వామి వారికి లింగాభిషేకాలు, శివారాధనలు, బిల్వార్చన పత్రిపూజలు చేశారు. హర హర మహాదేవ శంభో శంకర నామ స్మరణతో శివాలయాలు మారుమ్రోగాయి. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హనుమగల్ హయత్‌నగర్‌లోని స్వయంభువుడు రామలింగేశ్వర స్వామి, శాంతినగర్‌లోని సోమేశ్వర ఆలయం, వీరన్నగుట్టలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, ఇంజాపూర్‌లోని శివాలయం, అయ్యప్ప ఆలయంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. క్యూ లైన్‌లో ఉండి లింగార్చన, అభిషేకాలు చేశారు. మల్కాజిగిరి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ హయత్‌నగర్‌లోని స్వయంభువుడు రామలింగేశ్వరస్వామిని స్థానిక కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డితో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సతీ సమేతంగా హయత్‌నగర్ వీరన్నగుట్టలోని రామలింగేశ్వర స్వామికి అభిషేకం చేశారు. మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డిలు వీరన్నగుట్టలోని రామలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని అభిషేకం చేశారు. కల్వంచ శాంతినగర్‌లోని సోమేశ్వర ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి శివ దర్శనం చేసుకున్నారు. ఆలయ ధర్మకర్త సామ నరసింహారెడ్డి సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



హయత్‌నగర్‌లో అభిషేకం చేస్తున్న ఈటల రాజేందర్, కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

ఎల్బీనగర్: సరూర్‌నగర్, ఆర్కేపురం, లింగోజిగూడ డివిజన్లలో ప్రజలు భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలను జరుపుకున్నారు. సరూర్‌నగర్‌లోని బంగారు మైసమ్మ, కాశీవైద్యనాథేశ్వరస్వామి ఆలయంలో జరిగిన ఉత్సవాలలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పాల్గొని అభిషేకం నిర్వహించారు. ఈ ఉత్సవాలలో ఆలయ ట్రస్టీలు బేర బాలకిషన్, ఆకుల అరవింద్‌కుమార్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు రంజిత్, కాంగ్రెస్ నాయకులు రమేష్‌గౌడ్, బంగారు సందీప్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌ముదిరాజ్, వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు. ఆర్కేపురంలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో జరిగిన ఉత్సవాలలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, మధుర దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలలో ఆలయ మాజీ చైర్మన్ జగిని రమేష్, ఎస్ఆర్‌కేపురం కాలనీ అధ్యక్షుడు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సరూర్‌నగర్‌లోని కాశీవైద్యనాథేశ్వర ఆలయంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఆలయ ట్రస్టీలు బాలకిషన్, అరవింద్‌కుమార్

పూజల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల

కొత్తపేట: మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్‌తో కలిసి శుక్రవారం శివగంగ కాలనీలోని సదాశివేశ్వరాలయాన్ని సందర్శించారు. కాలనీ అధ్యక్షులు అంబాల మల్లేష్‌గౌడ్, కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి వెంకటరాముడు వారిని శాలువాలతో సన్మానించారు. అనంతరం వారు స్వామివారికి మహాశివరాత్రి విశేషపూజలు చేయించారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని ఆలయాల్లో, స్నేహపురి కాలనీలో వెలసిన గోదాసమేత పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలోని కాశీ విశ్వేశ్వరాలయంలో పరిసర కాలనీల భక్తులు స్వామికి పంచామృతాభిషేకాలు, సామూహిక రుద్రాభిషేకాలు చేశారు.

సైదాబాద్, అక్బర్‌బాగ్‌లలో..

సైదాబాద్: సైదాబాద్, మాదన్నపేట, అక్బర్‌బాగ్ పరిసరాలలోని దేవాలయాలు భక్తులతో పోటెత్తాయి. పూసలబస్తీ శివాంజనేయస్వామి ఆలయం, ఇంద్రప్రస్థకాలనీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, శంకేశ్వరా ఆలయం, కరన్‌బాగ్ మల్లన్నస్వామి ఆలయం, జైలుగార్డెన్ ఆంజనేయస్వామి ఆలయం, ఐఎస్‌సదన్ చౌరస్తాలోని శివాలయం, పల్లవ్ హరిహర క్షేత్రం, మాదన్నపేట శివాంజనేయ ఆలయాలకు ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు.



భక్తులతో కిటకిటలాడుతున్న హయత్‌నగర్‌లోని శివాలయం

చంపాపేట, హస్తినాపురంలలో..

చంపాపేట: చంపాపేట, హస్తినాపురం డివిజన్‌లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలోని నాగేశ్వర, స్ఫటిక లింగేశ్వర, విశ్వనాథస్వామికి ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక రుద్రాభిషేకం, రుద్రహోమంలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఈఓ ఎం.శ్రీనివాసశర్మ, ధర్మకర్తలు శివలింగాలకు అభిషేకాలు నిర్వహించారు. కర్మన్‌ఘాట్ ఓల్డ్ విలేజ్‌లోని శివాలయంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

హస్తినాపురం డివిజన్‌లో..

హస్తినాపురం డివిజన్‌లోని సత్యదేవ్ ఎన్‌క్లేవ్‌కాలనీ, అగ్రికల్చర్‌కాలనీ, టీచర్స్‌కాలనీలో వేడుకల్లో కార్పొరేటర్ సుజాతానాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బైరామల్‌గూడ డిఫెన్స్‌కాలనీలోని హరిహర క్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ వ్యవస్థాపకులు, చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

బడంగ్‌పేట్, మీర్‌పేట్‌లలో..

సరూర్‌నగర్: బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని బడంగ్‌పేట్, నాదర్‌గుల్, బాలాపూర్, మల్లాపూర్, వెంకటాపూర్, మామిడిపల్లి, కుర్మల్‌గూడ, గుర్రంగూడ, అల్మాస్‌గూడ, రాగన్నగూడ, మీర్‌పేట్, జిల్లెలగూడ, బాలాపూర్ చౌరస్తా తదితర ప్రాంతాల్లోని అన్ని ఆలయాలు శుక్రవారం తెల్లవారు జాము నుంచే భక్తులతో సందడిగా మారాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని ప్రజలు అబ్దుల్లాపూర్‌మెట్‌లోని కామాక్షిపీఠం, పెద్దఅంబర్‌పేట్‌లోని శివాలయం, తట్టిఅన్నారంలోని లలిత భువనేశ్వరీసమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



ఆర్‌కేపురం ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుకా ఉపేందర్‌రెడ్డి, మధుర దంపతులు



సరూర్‌నగర్ చౌడీలోని పాత శివాలయంలో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు



కర్మన్‌ఘాట్ ఆలయంలో బాలికల నృత్యం



హస్తినాపురం డివిజన్‌లోని సత్యదేవ్ ఎన్‌క్లేవ్‌లోని శివాలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

ఘనంగా మహిళా దినోత్సవం

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అఖిల భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 12వ వార్డు ఆర్ఎన్ఆర్ కాలనీలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షురాలు నీలమ్మ హాజరై మహిళా సంఘం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా పలువురి మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షురాలు కాటి అరుణ, కార్యదర్శి వట్టి నవనీతతో పాటు పలువురు పాల్గొన్నారు.

సరూర్‌నగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మునిసిపల్ పరిపాలన శాఖ ఆదేశాల మేరకు శుక్రవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కార్పొరేషన్‌లో పనిచేసే మహిళా సిబ్బందిని, ఉద్యోగులను మునిసిపల్ కమిషనర్ జి.రఘు ఘనంగా సన్మానించి మొక్క అందజేశారు. మేనేజర్ నాగేశ్ బాబు, ఆర్వో డి.చంద్రశేఖర్‌రెడ్డి, అకౌంటెంట్ వనజ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధి వస్తువులు అందజేత

మన్సూరాబాద్: ఎల్బీనగర్ రాక్‌హిల్స్ కాలనీలో సామాజిక కార్యకర్త దోసపాటి రాము నిర్వహిస్తున్న రైస్ ఏటీఎం వద్ద శుక్రవారం 15 మంది మహిళలకు స్వయం ఉపాధి వస్తువులను అందజేశారు. ప్రాజెక్ట్ ప్రిషా పేరిట 2 టీ షాపులు, 3 టిఫిన్ సెంటర్ల సామగ్రి ఐదు కుట్టు మిషన్లు, ఐదు తోపుడు బండ్లు అందజేసినట్లు రాము తెలిపారు. ఇప్పటి వరకు 3వేల మందికి స్వయం ఉపాధి వస్తువులను అందజేసినట్లు ప్రాజెక్ట్ ప్రిషా కన్వీనర్ జొన్నలగడ్డ యశశ్విని తెలిపారు.



మహిళా సిబ్బందిని సన్మానించి మొక్క అందజేస్తున్న కమిషనర్ రఘు

మోదీ సేవలు దేశానికి ఎంతో అవసరం

- మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

వనస్థలిపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలు ప్రధాని నరేంద్ర మోదీ పాలనను ఆసక్తితో చూస్తున్నాయని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఈటల రాజేందర్ హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ సేవలు దేశానికి ఎంతో అవసరం అన్నారు. అందుకు దేశప్రజలు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి బీజేపీ ప్రభుత్వాన్ని బలపర్చాలని కోరారు. అందులో భాగంగా మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా తనను బీజేపీ అధిష్ఠానం ప్రకటించిన నేపథ్యంలో ప్రతి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తన గెలుపునకు విశేషంగా కృషి చేయాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల అస్తిత్వాన్ని దెబ్బతీసిందన్నారు. న్యాయానికి, అన్యాయానికి జరుగుతున్న యుద్ధంలో తనదే విజయమన్నారు. తనకు ప్రజలు మద్దతు తెలపాలన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, డివిజన్ అధ్యక్షులు నూతి శ్రీనివాస్, రవిశంకర్, చిన్న యాదవ్, భార్గవ్ తేజ పాల్గొన్నారు.

నకిలీ భూదాన్ సర్టిఫికెట్లతో రిజిస్ట్రేషన్ ప్లాట్ల కబ్జా

- నయీం అనుచరులమంటూ బెదిరింపులు
- న్యాయం కోరుతున్న బాధితులు



రిజిస్ట్రేషన్ ప్లాట్‌ను కబ్జా చేసి అందులో చేపడుతున్న నిర్మాణం

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నకిలీ భూదాన్ సర్టిఫికెట్లతో కొందరు వ్యక్తులు రిజిస్ట్రేషన్ ప్లాట్లను కబ్జా చేస్తున్నారు. భూదాన్ భూమి పక్కనే ఉన్న ప్రైవేట్ వెంచర్‌లో కనిపించిన ఖాళీ ప్లాట్లను గుర్తించి రాత్రికి రాత్రే వాటిలో నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన రిజిస్ట్రేషన్ ప్లాట్ల యజమానులకు నయీం అనుచరులమంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం భూదాన్ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోల్డెన్ సిటీ లేఅవుట్ ఎండీ లక్ష్మణ్‌జీ, రాంబాబుయాదవ్ బాధితులతో కలిసి వివరాలు వెల్లడించారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 278/1, 278/2, 68 నుంచి 71లోని మొత్తం 26 ఎకరాల్లో గోల్డెన్ సిటీ పేరుతో 2003-24లో లేఅవుట్ చేసినట్లు తెలిపారు. లేఅవుట్‌కు ముందు భాగంలో సుమారు 10 ఎకరాల్లో భూదాన్ కాలనీ ఉందన్నారు. అయితే ఇటీవలే సింగరేణి కాలనీకి చెందిన షేక్‌లాల్ అహ్మద్ అనే వ్యక్తి లేఅవుట్‌లోని రిజిస్ట్రేషన్ ప్లాట్లను కబ్జా చేస్తున్నాడని ఆరోపించారు. సెలవు రోజులు, రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్మాణాలు చేపడుతున్నాడని తెలిపారు. ఈ విషయంపై ప్రశ్నిస్తే నయీం అనుచరులమంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. దీంతో తాము కోర్టుకు వెళ్లి స్టేటస్‌కో ఆర్డర్ తెచ్చుకున్నామని చెప్పారు. అయినప్పటికీ ఆక్రమణకు పాల్పడుతూనే ఉన్నాడని తెలిపారు. వారం రోజుల క్రితం హయత్‌నగర్ పోలీసులకు, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. లక్షల రూపాయలు పెట్టి ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. బెదిరింపులతో కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమ ప్లాట్లను కాపాడాలని కోరారు.

తండ్రిని హత్యచేసిన కొడుకు అరెస్ట్, రిమాండ్

వనస్థలిపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): తనపేరుపై భూమి రిజిస్ట్రేషన్ చేస్తలేడని కోపం పెంచుకున్న కొడుకు తన తండ్రిని చంపి, ఆత్మహత్య చేసుకున్నాడని కట్టుకథ అల్లిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ వై.అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం సాహెబ్‌నగర్ వెంకటేశ్వర కాలనీకి చెందిన రుద్రపల్లి శేఖర్(42) తండ్రి రుద్రపల్లి మైసయ్య గత నెల 16న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాగా మైసయ్యది ఆత్మహత్య కాదు, లుంగితో గొంతు పిసికి చంపారని వైద్యులు పోస్టుమార్టం రిపోర్టులో తెలిపారు. పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన ఇన్‌స్పెక్టర్ మృతుని కొడుకు శేఖర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. తన పేరిట 20 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని కొద్దినెలలుగా తన తండ్రి మైసయ్యను శేఖర్ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీంతో విసిగిపోయిన మైసయ్య ప్రతి రోజు మద్యం తాగి దూషించడంతో కాలనీలో తనని అవమానపర్చుతున్నారని శేఖర్ తన తండ్రిపై కోపం పెంచుకున్నాడు. దీంతో శేఖర్ గత నెల 15న ఇంట్లో ఎవరూ లేని సమయంలో లుంగితో తన తండ్రి గొంతు పిసికి చంపివేశాడు. ఎవరికీ అనుమానం రాకుండా తన తండ్రి మైసయ్య తన ఇంట్లోనే లుంగితో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించినట్లు శేఖర్ పోలీసుల ముందు నిజం ఒప్పుకున్నారు. ఈ మేరకు పోలీసులు శేఖర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వృద్ధురాలు అదృశ్యం

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధి లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. స్టేషన్ పరిధిలోని గండిచెరువు గ్రామానికి చెందిన ఎం. లక్ష్మమ్మ(70) బుధవారం సాయంత్రం 4గంటలకు వైద్య పరీక్షల కోసం పెద్దఅంబర్‌పేట్‌కు వెళ్లింది. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువుల, చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం లక్ష్మమ్మ మనువడు వంశీ అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెత్తకు నిప్పు.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మంటలు



కాలిపోతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

చాదర్‌ఘాట్ : గుర్తు తెలియని వ్యక్తులు చెత్తను కాల్చడంతో అక్కడే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మంటలంటుకుని అగ్నిప్రమాదం జరిగిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మలక్‌పేట లాలాజర్ హోటల్ ఎదుట శుక్రవారం జరిగింది. చాదర్‌ఘాట్ పోలీసులు, విద్యుత్ సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట లాలాజర్ హోటల్ ఎదుట రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వాటి చుట్టుపక్కన స్థానికులు వేసిన చెత్తకుప్పను గుర్తు తెలియని వ్యక్తులు కాల్చారు. చెత్త నుంచి మంటలు అక్కడే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు అంటుకోవడంతో ఒక్కమారుగా మంటలు ఉవ్వెత్తున లేచాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు మొదట్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్నిప్రమాదం జరిగినట్లు అనుమానించారు. వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. హుటాహుటిన అగ్నిప్రమాపక దళాన్ని రప్పించి మంటలను అదుపు చేశారు. ఈసంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం అగ్నిప్రమాదానికి కారణాలను ఆరాతీయగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద స్థానికులు వేసిన చెత్తను కాల్చడం వల్లే అగ్నిప్రమాదం జరిగినట్లు చాదర్‌ఘాట్ విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులు గుర్తించారు. అగ్నిప్రమాదానికి కారకులను గుర్తించేందుకు చాదర్‌ఘాట్ పోలీసులు చర్యలు చేపట్టారు. రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వాటి కేబుళ్లు పూర్తిగా కాలిపోయాయని అధికారులు తెలిపారు.